క్లుప్తంగా

ఉపాధ్యాయునికి సన్మానం



భాస్కర్‌రెడ్డి దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

తలుపుల : మండల కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తూ సోమవారం ఉద్యోగ విరమణ పొందిన కోడూరు భాస్కర్‌రెడ్డిని తోటి ఉపాధ్యాయులు, బంధు మిత్రులు ఘనంగా సన్మానించారు. హెచ్‌ఎం సావిత్రి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు మాట్లాడారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

కదిరి అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న ఇంగ్లిష్, ఎకనామిక్స్ గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ మహ్మద్ సోమవారం ఓ ప్రకటనలో కోరారు. ఆయా సబ్జెక్టులకు పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో 50 శాతం మార్కులు ఉన్న వారు అర్హులని, నాలుగో తేదీ లోపు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఐదో తేదీ ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు.

నిత్యపూజ నివేదన

బత్తలపల్లి: మొహర్రం వేడుకల్లో భాగంగా బత్తలపల్లి ఖాశీంస్వామికి సోమవారం నిత్యపూజ నివేదన నిర్వహించారు. ఉదయం ముజావర్లు మహబూబ్‌బాషా, ఖాశీంపీరా, ఫక్రుద్దీన్, ఖాశీంవలిలు పీర్ల చావిడిలో ఫాతెహా చేశారు.

కొలువుదీరిన పీర్లు



తలుపుల : మండల కేంద్రం ఎగువపేటలో దాతల సహకారంతో రూ.13లక్షల వ్యయంతో నిర్మించిన పెద్ద మకాన్‌లో మొహర్రం ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. సోమవారం పెద్దమకాన్‌లో అలంకరించి పీర్లను కొలువుదీర్చారు.

ఉత్తమ సేవలతోనే సార్థకత

ధర్మవరం అర్బన్: విధి నిర్వహణలో ఉత్తమ సేవలందించగలిగినపుడే ఉద్యోగానికి సార్థకత చేకూరుతుందని ఆర్టీసీ డిపో మేనేజర్ సత్యనారాయణ తెలిపారు. పట్టణంలోని ఆర్టీసీ డిపోలో సోమవారం ఐదుగురు ఉద్యోగులు రిటైరయ్యారు. వారందరికీ అభినందన సభ ఏర్పాటు చేశారు. ఆర్టీసీ యూనియన్ నాయకుడు నాగార్జునరెడ్డి సభాధ్యక్షులుగా వ్యవహరించారు. రిటైర్డ్ ఉద్యోగులు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీరాములు, డ్రైవర్లు నరసింహులు, గోవిందరాజులు, కండక్టర్లు దూలెప్ప, పురుషోత్తంలను తోటి ఉద్యోగులు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు.

శాంతియుతంగా నిర్వహించాలి

ధర్మవరం అర్బన్: రెవెన్యూ డివిజన్ పరిధిలో మొహర్రం వేడుకలు శాంతియుతంగా నిర్వహించుకోవాలని ఆర్డీఓ మహేష్ సూచించారు. పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం పలు శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ అన్ని గ్రామాలు, పట్టణంలో మొహర్రం వేడుకలు ప్రశాంతంగా సాగేలా కార్యాచరణ రూపొందించుకోవాలన్నారు.

నోట్ పుస్తకాల పంపిణీ

రామగిరి: గంతిమర్రి పంచాయతీలోని కలికివాండ్లపల్లి, పెనుబోలు, గంతిమర్రి గ్రామాలకు చెందిన 1 నుంచి 5వ తరగతి చదువుతున్న విద్యార్థులకు సోమవారం దుర్భాకుల సత్యనారాయణ జ్ఞాపకార్థం నోట్‌పుస్తకాలు పంపిణీ చేశారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి, గోపాల్‌రెడ్డి, గడ్డం రామ్మోహన్, శివారెడ్డి పాల్గొన్నారు.

6న రెడ్డి సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం

పుట్టపర్తి టౌన్: ఏపీ రెడ్డి సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఈ నెల ఆరో తేదీన పుట్టపర్తిలో నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు బాబుల్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర అధ్యక్షుడు గంగులకుంట నరేష్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన జరిగే సమావేశానికి రాష్ట్ర ప్రతినిధులు, జిల్లాల అధ్యక్షులు హాజరవుతారని పేర్కొన్నారు.

శుద్ధజల కేంద్రం ప్రారంభం



శుద్ధజల కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఆర్టీటీ అధికారులు

ముదిగుబ్బ: మర్తాడులో రూ.9,50,000 జీఎస్‌ఎన్ నిధులతో చేపట్టిన శుద్ధజల కేంద్రాన్ని ఆర్టీటీ డైరెక్టర్ కె.సాగర్ మూర్తి, రీజినల్ డైరెక్టర్లు ప్రమీల కుమారి, హనుమంతప్ప, ఏటీఎల్ కృష్ణ, సర్పంచ్ శివారెడ్డిల చేతుల మీదుగా ప్రారంభించారు. కార్యక్రమంలో సీఓలు పర్వీన్, కీర్తి, శ్రీరాములు, రమణప్ప, సీడీసీలు శ్రీరాములు, సత్యనారాయణ, వరదప్ప, వెంగమ్మ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

- ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం
- దోమల నివారణ కోసం లిక్విడ్. కాయిల్స్ వినియోగం
- నియోజకవర్గంలో ఏటా రూ.8.19 కోట్లు వెచ్చిస్తున్న జనం
- పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో దోమల నివారణ చర్యలు నామమాత్రం

దోమల దండయాత్ర



ధర్మవరంలోని సుందరయ్య నగర్‌లో ప్రధాన రహదారిపై పారుతున్న మురుగు



తాడిమర్రిలో రహదారిపైనే నిలిచిన నీరు



ముదిగుబ్బలో ప్రధాన రహదారి పక్కనే చెత్తాచెదారం

ధర్మవరం అర్బన్: పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యం పడకేసింది. రహదారులపైనే మురుగునీరు పారుతోంది. చెత్త ట్రాక్టర్లు, చెత్తను తొలగించే కార్మికులు గ్రామాల్లోకి రాకపోవడంతో ఇళ్లమధ్యనే చెత్తాచెదారం పేరుకుపోయి అపరిశుభ్రత తాండవిస్తోంది. దోమలు వృద్ధి చెంది వ్యాధులు విజృంభిస్తున్నాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం ధర్మవరం నియోజకవర్గంలో ధర్మవరం పట్టణం, గ్రామీణం, బత్తలపల్లి, తాడిమర్రి, ముదిగుబ్బ మండలాల్లో 3,04,706 జనాభా ఉంది. మొత్తం77,068 గృహాలు ఉన్నాయి. ఇందులో మూడో వంతు 61,564 గృహాల వారు దోమల నివారణ కోసం కరెంటుతో వాడే ఆలౌట్, గుడ్‌నైట్ తదితర లిక్విడ్ వాడుతున్నట్లు ఒక అంచనా. ఇందు కోసం ఒక్కో కుటుంబం లిక్విడ్ కోసం నెలకు రూ.100 వెచ్చిస్తోంది. ఈ లెక్కన ప్రతి నెలా రూ.61,56,400 లిక్విడ్ రూపంలో ఖర్చు చేస్తున్నారు. ఇక ఒకటో వంతు 11,229 గృహాల వారు అగ్గితో కాల్చే కాయిల్స్ (దోమల చుట్టలు) వాడుతున్నారని తెలుస్తోంది. దోమల చుట్ట బాక్స్‌కు నెలకు రూ.60 వెచ్చిస్తున్నారు. అలా నెలకు రూ.6,73,740 రూపాయలు ఖర్చు చేస్తున్నారన్నమాట. లిక్విడ్- దోమల చుట్టలకు కలిపి ప్రజలు ప్రతి నెలా రూ.68,30,140 వ్యయం చేస్తున్నారు. ఈ లెక్కన సంవత్సరానికి రూ.8,19,61,680 ఖర్చు అవుతోందన్నమాట...

దోమల నివారణ చర్యలు అంతంతే..

ధర్మవరం పట్టణంలో మున్సిపల్ అధికారులు దోమల నివారణ చర్యలు చేపడుతున్నారు. పెద్ద పెద్ద మురుగు కాలువలు, మురుగునీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్‌వేస్తున్నారు. అప్పుడప్పుడు కాలువలను శుభ్రం చేసి చేతులు దులుపుకుంటున్నారు. ఏవో కొన్ని వార్డుల్లో ఫాగింగ్ చేయిస్తున్నారు. ఇక మండలాల్లో పంచాయతీ అధికారులు కనీసం నెలకోసారైనా దోమల నివారణ చర్యలు చేపట్టిన దాఖలాలు లేవు. దీంతో దోమలు వ్యాప్తి చెంది విషజ్వరాలు ప్రబలుతున్నాయి.

ప్రభుత్వ ఆస్పత్రుల వైద్యులు చేస్తున్నదీ...

ప్రభుత్వ ఆసుపత్రులకు దోమల నివారణ కోసం ఫాగింగ్ చేయించేందుకు మలేరియా వ్యాధి ప్రబలకుండా ఉండేందుకు ప్రభుత్వం మెలాథిన్‌ను సరఫరా చేస్తుంది. కాని ధర్మవరం నియోజకవర్గంలో మలేరియా సబ్‌యూనిట్ అధికారి మాత్రం తన పరిధిలోనున్న ప్రాంతాల్లో మెలాథిన్‌ను స్ప్రే చేయిస్తున్నారు. దోమల నివారణ కోసం ప్రత్యేక నిధులు రాకపోవడంతో ప్రభుత్వ ఆస్పత్రుల వైద్యులు కూడా దోమల నివారణ కోసం ఎలాంటి చర్యలు చేపట్టలేదు. కేవలం ఆస్పత్రులు, పీహెచ్‌సీలకు వచ్చే రోగులకు వైద్యం చేసి పంపుతున్నారు.

ధర్మవరం నియోజకవర్గంలో దోమల నివారణ కోసం వెచ్చిస్తున్న వారి వివరాలు (సుమారుగా)

మండలం	జనాభా	నివాసాలు	ఆలౌట్ వాడే కుటుంబాలు	కాయిల్స్ వాడే కుటుంబాలు
ధర్మవరం టౌన్	1,21,874	30,096	26,322	2,774
ధర్మవరం రూరల్	50,605	12,795	9,597	2,198
బత్తలపల్లి	39,373	10,074	7,567	1,522
తాడిమర్రి	32385	8,572	6,429	1,843
ముదిగుబ్బ	60,469	15,531	11,649	2,892
మొత్తం	3,04,706	77,068	61,564	11,229

ప్రత్యేక చర్యలు చేపట్టాలి



దోమల నివారణలో అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారు. పలు మార్లు కౌన్సిల్ సమావేశంలో ప్రస్తావించినా తూతూ మంత్రంగా ఫాగింగ్ చేస్తున్నారు. పెద్ద పెద్ద మురుగు నీటిలో ఆయిల్ బాల్స్ వేయడంలేదు. దీంతో ప్రజలు దోమలతో అవస్థలు పడుతున్నారు. దోమల నివారణకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలి. మురుగునీటిలో ఆయిల్‌బాల్స్ వేసి దోమలు లార్వా వృద్ధి చెందకుండా చర్యలు చేపట్టడంతోపాటు అన్ని వార్డుల్లో తరచూ ఫాగింగ్ చేయించాలి.

– గోరకాటి పురుషోత్తంరెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్, ధర్మవరం

సమస్యలపై కౌన్సిలర్ల ఏకరువు



కదిరి టౌన్: మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలపై కౌన్సిలర్లు ఏకరువు పెట్టారు. సోమవారం మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో చైర్‌పర్సన్ దిల్షాదున్నీసా అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. పలువురు కౌన్సిలర్లు మాట్లాడుతూ కూరగాయల మార్కెట్ రోడ్డు, వలిసాబ్ రోడ్డు, కంచుకోట, రాజేంద్రప్రసాద్ వీధి, అమీన్‌నగర్, రాజీవ్‌గాంధీనగర్, నల్లగుట్టవీధి, అడపాలవీధి, చౌక్‌బజారు, మశానం పేట తదితర చోట్ల వీధి కుక్కలు బెడద అధికంగా ఉందని, చిన్నారులపై దాడులు చేస్తున్నాయని తెలిపారు. పలు వార్డుల్లో చెత్తబండ్లు రాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వార్డుల్లో దోమల నివారణకు ఫాగింగ్ చేయాలన్నారు. కూరగాయల మార్కెట్ రూమ్‌లలో కొందరు బినామి పేర్లుతో టెండర్ దక్కించుకొని రూ.7 వేల నుంచి రూ.28 వేల వరకు ఇతరుల నుంచి అద్దె వసూలు చేస్తున్నారన్నారు. కానీ సంస్థకు మాత్రం చెల్లింపులు చేయడం లేదన్నారు. వార్డుల్లో డ్రెయినేజీలు శుభ్రం చేయాలన్నారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రాజశేఖరాచారి, సుధారాణి, మున్సిపల్ ఏఈ సందీప్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ ఎస్.ఆరీఫ్ అహమ్మద్, మున్సిపల్ కౌన్సిలర్లు, అన్నిశాఖల అధికారులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ దిల్షాదున్నీసా, హాజరైన కౌన్సిల్ సభ్యులు

కేవీకేని పుట్టపర్తి నుంచి తరలించొద్దు

పుట్టపర్తి: కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)ని పుట్టపర్తి నుంచి బత్తలపల్లికి తరలించే ప్రయత్నాన్ని కూటమి ప్రభుత్వం విరమించుకోవాలని వైఎస్సార్‌సీపీ నాయకులు సూచించారు. ఈ మేరకు అగ్రి అడ్వైజరీ బోర్డు జిల్లా మాజీ చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి, ఎంపీపీ పీపీ రమణారెడ్డి, పట్టణ, రూరల్ వైఎస్సార్‌సీపీ కన్వీనర్లు రవి నాయక్, ఈశ్వరయ్య, కౌన్సిలరు, రైతులు తదితరులు సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో వినతిపత్రం సమర్పించారు. పుట్టపర్తి సమీపంలోనే కావల్సినంత భూమి, హంద్రీ–నీవా కాలువ ద్వారా వచ్చే నీళ్లు అందుబాటులో ఉన్నందున కృషి విజ్ఞాన కేంద్రం తరలింపుయత్నాన్ని ప్రభుత్వం మానుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మాతంగి తిప్పన్న, జిల్లా అధికార ప్రతినిధి ఫాటో సాయి, కౌన్సిలర్ చెరువు భాస్కర్‌రెడ్డి, మాజీ పట్టణ కన్వీనర్ మాధవరెడ్డి, కౌన్సిలర్ నారాయణరెడ్డి, రమేష్, రైతులు గోపాల్‌రెడ్డి, రంగారెడ్డి, ఓబిరెడ్డి, భగవంతరెడ్డి, జయరామిరెడ్డి, మోహన్‌రెడ్డి, చిన్నపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



డీఆర్వోకు వినతిపత్రం సమర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నేడు పింఛన్ల పంపిణీ

బత్తలపల్లి: సామాజిక భద్రత పింఛన్లు మంగళవారం నుంచి రెండు రోజులు పాటు పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ నరసింహనాయుడు పేర్కొన్నారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ బత్తలపల్లి మండలంలోని 11 గ్రామ సచివాలయాల పరిధిలో 6,231 మంది లబ్ధిదారులు ఉన్నారన్నారు. వీరికి రూ.2,75,51,500 నిధులు మంజూరైనట్లు తెలిపారు.

అప్రూవల్ ఉన్నా అడ్డుకోవడమేంటి?

ధర్మవరం అర్బన్: ప్లాన్ అప్రూవల్ ఉన్నా ఇళ్ల నిర్మాణాలు సాగకుండా అడ్డుకోవడమేంటని మున్సిపల్ అధికారులను పలువురు నిలదీశారు. మున్సిపల్ కార్యాలయంలో సోమవారం చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి ఆధ్వర్యంలో కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. అలా మొదలవగానే అరగంట పాటు విద్యుత్ అంతరాయం ఏర్పడింది. కౌన్సిలర్లు సెల్‌ఫోన్ టార్చ్ వెలుతురులో అజెండా చదువుతూ అవస్థలు పడ్డారు. అనంతరం కరెంట్ రావడంతో సమావేశం జరిగింది. కౌన్సిలర్ చందమూరి నారాయణరెడ్డి మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో చాలామంది ఇంటి ప్లాన్ అప్రూవల్ కోసం రూ.లక్షల్లో చలానాలు చెల్లించినా.. మూడేళ్ల చలానా తక్కువ కట్టారంటూ ఇళ్లు కట్టుకోకుండా ఆపడం సరికాదన్నారు. కమిషనర్ ప్రమోద్‌కుమార్ స్పందిస్తూ పట్టణంలో దాదాపు 363 ఇళ్లకు చలానా తక్కువ ఉన్నట్లు గుర్తించి నోటీసులు జారీ చేశామన్నారు. మున్సిపల్ జనరల్ ఫండ్స్ నుంచి శానిటేషన్ విభాగానికి లైమ్ పౌడర్ కొనుగోలుకు ఎస్టిమేషన్ కాంట్రాక్టు విలువ రూ.5.50 లక్షలు పెడితే కాంట్రాక్ట్ టెండర్ మొత్తం రూ.10.79 లక్షలు ఎలా అజెండాలో చూపిస్తారని కౌన్సిలర్ చందమూరి నారాయణరెడ్డి ప్రశ్నించారు. అజెండాలో తప్పుగా ప్రింట్ అయిందని కమిషనర్ సర్దిచెప్పారు. మున్సిపల్ వైస్ చైర్మన్ జయరామిరెడ్డి మాట్లాడుతూ కదిరి గేటు టర్నింగ్ వద్ద రోడ్డుపైనే చేపలు అమ్ముతుండటంతో తరచూ రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. కళాజ్యోతి సర్కిల్‌లోని మున్సిపల్ కాంప్లెక్స్‌పై యోగా చేసుకునేందుకు అసోసియేషన్‌కు కేటాయించాలని కమిషనర్ తెలపగా.. భవిష్యత్తులో కాంప్లెక్స్‌పై నిర్మాణం చేపట్టేందుకు ఇబ్బంది అవుతుందని కౌన్సిలర్ శివ అభ్యంతరం వ్యక్తం చేశారు. పార్థసారథినగర్‌లో కొళాయి పైపులైన్ల కోసం గుంతలు తవ్వి అలాగే వదిలేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని కౌన్సిలర్ గోరకాటి పురుషోత్తంరెడ్డి తెలిపారు. కేబుల్ ఏర్పాటు కోసం రోడ్లను పాడు చేస్తున్నారని, వాటిని తిరిగి ఎవరు వేయిస్తారని కౌన్సిలర్ చందమూరి నారాయణరెడ్డి నిలదీశారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ షేక్ శంషాద్‌బేగం, వేముల జయరామిరెడ్డి, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.



కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి

కౌన్సిల్‌లో సీఐటీయూ నేతల నిరసన

ధర్మవరం: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కౌన్సిల్ అజెండాలో తీర్మానం చేయాలని సీఐటీయూ నాయకులు, కార్మికులు కౌన్సిల్ సమావేశంలో నిరసనకు దిగారు. మున్సిపల్ కమిషనర్, చైర్‌పర్సన్ వారికి సర్దిచెప్పారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ చాంబర్‌లోకి వెళ్లి కార్మికుల సమస్యలపై చర్చించారు. సీఐటీయూ మండల కన్వీనర్ జె.వి.రమణ, కో కన్వీనర్ అయూబ్‌ఖాన్, ఇంజినీరింగ్ సెక్షన్ కార్మిక సంఘం గౌరవాధ్యక్షుడు బొగ్గు నాగరాజు, కార్యదర్శి బాబు, జిల్లా ఉపాధ్యక్షుడు అనిల్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతమే లక్ష్యం

చెన్నేకొత్తపల్లి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త కష్టపడి పని చేయాలని పార్టీ మండల కన్వీనర్ డోలా రామచంద్రారెడ్డి సూచించారు. సోమవారం మండల కేంద్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జెడ్పీటీసీ గోవిందరెడ్డి, సత్యసాయి జిల్లా పార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీ రామకృష్ణారెడ్డి, వలంటీర్ విభాగం జిల్లా నాయకుడు హరినాథ్‌రెడ్డి మాట్లాడుతూ.. అధికార పార్టీపై ప్రజల్లో వ్యతిరేకత ఉందన్నారు. ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మోసం చేసిందని.. వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అత్యధిక సీట్లు గెలిచేలా పని చేయాలన్నారు. సమావేశంలో నాయకులు ఎస్టీడీ శ్రీనివాసరెడ్డి, నరసింహారెడ్డి, ప్రకాష్‌రెడ్డి, పవన్ కుమార్‌రెడ్డి, నగేష్, నారాయణ స్వామి, బొగ్గు కిష్ట, ఓబులేసు, సర్పంచులు జయారెడ్డి, రామాంజనేయులు, క్రిష్టమూర్తి, నాయకులు హనుమంతరెడ్డి, మనేరు నరసింహులు, మండల నరసింహులు, పూజారి ఆంజనేయులు, లింగారెడ్డి, విశ్వనాథరెడ్డి, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పేదలకు ఇళ్ల స్థలాలివ్వాలి

కదిరి టౌన్: కుమ్మరవాండ్లపల్లి పంచాయతీ సర్వే నంబర్ 720లో గుడిసెలు వేసుకున్న పేదలందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జీఎల్ నరసింహులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పేదలతో వ్యక్తిగత అర్జీలను సోమవారం జరిగిన గ్రీవెన్స్‌లో సీఎస్‌డీటీ కె.వి.రవి ప్రసాద్‌కు అందజేశారు.

చెరువు కట్టకు మరమ్మతులు చేపట్టాలి

కనగానపల్లి: గత సంవత్సరం భారీ వర్షానికి తెగిపోయిన కనగానపల్లి చెరువు కట్టకు మరమ్మతులు చేపట్టాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బెల్లం మహదేవ కోరారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్‌లో మండల సీపీఐ, రైతు సంఘం నాయకులతో కలసి తహసీల్దార్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు.

బడుగు బలహీన వర్గాల పక్షాన పోరాటం

ఓడీచెరువు: సమాజంలో అట్టడుగున ఉన్న బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యంగా సీపీఐ పోరాటం చేస్తోందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ తెలిపారు. ఓడీచెరువులోని షాదీ మహల్‌లో సోమవారం సీపీఐ శతజయంతి ఉత్సవాల్లో భాగంగా మండల రెండవ మహాసభలను ఘనంగా నిర్వహించారు. సీపీఐ జెండా ఆవిష్కరించి ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన మండల మహాసభలను ఉద్దేశించి వేమయ్య యాదవ్ తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కదిరప్ప, మండల కార్యదర్శి చలపతి, రైతు సంఘం కార్యదర్శి పూల శ్రీనివాసులు, రత్నాబాయి, రామచంద్ర, సుధాకర్, అంజినప్ప పాల్గొన్నారు.

ఆశా పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కదిరి అర్బన్: పట్నం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలోని ఎగువపల్లి పంచాయతీ కె.బత్తలపల్లిలో ఖాళీగా ఉన్న ఆశా కార్యకర్త పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డాక్టర్ వినోద్ తెలిపారు.

తనకల్లు: కొక్కంటి పీహెచ్‌సీ పరిధిలోని బొంతలపల్లి, చీకటిమానిపల్లి, టి.సదుం, కొర్తికోట గ్రామాల్లో ఖాళీగా ఉన్న ఆశా కార్యకర్తల పోస్టులకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని వైద్యాధికారి లోకేశ్వర్‌రెడ్డి కోరారు.

ధర్మవరం రూరల్: మల్లేనిపల్లిలో ఖాళీగా ఉన్న ఆశా కార్యకర్త పోస్టుకు 4వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని డాక్టర్ పుష్ప సోమవారం తెలిపారు. దరఖాస్తులను దర్శనమల పీహెచ్‌సీలో అందజేయాలన్నారు.

తహసీల్దార్ అనంతాచారికి ఘనంగా వీడ్కోలు

ఓడీచెరువు : ఉద్యోగ విరమణ చేసిన తహసీల్దార్ అనంతాచారికి సోమవారం తహసీల్దార్ కార్యాలయ ఉద్యోగులు ఘనంగా వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో డీటీ శ్రీనివాసరెడ్డి, ఆర్‌ఐ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు

ఉద్యోగ విరమణ సహజం

చెన్నేకొత్తపల్లి: ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి ఉద్యోగ విరమణ సహజమని ప్రొహిబిషన్, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య అన్నారు. చెన్నేకొత్తపల్లిలోని ప్రొహిబిషన్, ఎక్సైజ్ సర్కిల్ సేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఎస్‌ఐ వెంకటాచలం సోమవారం ఉద్యోగ విరమణ చేశారు. జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ గోవింద నాయక్, అసిస్టెంట్ సూపరింటెండెంట్లు నరసింహులు, శ్రీరామ్ తదితరులు ఎస్‌ఐ వెంకటాచలం సేవలను కొనియాడారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

కదిరి అర్బన్: కట్టిలతండాలో సోమవారం ఎంపీడీఓ పోలప్ప ఆధ్వర్యంలో జాతీయ పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. రూరల్ అప్‌గ్రేడ్ పోలీ స్టేషన్ సీఐ నిరంజన్‌రెడ్డి, ఎంఈఓలు చిన్నిక్రిష్ణ, ఓబుల్‌రెడ్డి హాజరై మాట్లాడారు.

పూరి జగన్నాథుని రథయాత్ర



ధర్మవరం అర్బన్: ఇస్కాన్ ఆధ్వర్యంలో సోమవారం పూరి జగన్నాథస్వామి రథయాత్రను ధర్మవరంలో వైభవంగా నిర్వహించారు. ఒడిషాలోని పూరి క్షేత్రంలో జరుగుతున్న రథయాత్రను పురస్కరించుకుని ధర్మవరంలో ఇస్కాన్ వారి ఆధ్వర్యంలో శ్రీకృష్ణ బలరామ, సుభద్ర స్వాములకు ప్రత్యేక అలంకరణలు చేసి పూజలు చేశారు. అనంతరం ప్రత్యేక రథంపై కొలువుదీర్చి ఊరేగించారు.

'అట్రాసిటీ' కేసు నమోదు

నల్లచెరువు: యర్రగుంటపల్లికి చెందిన రాజు, నవీన్, నంద కిషోర్ అనే వ్యక్తులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. గ్రామంలో క్రిష్ణయ్య కుటుంబానికి, రాజు కుటుంబానికి మధ్య ఆరేళ్లుగా గొడవలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో రాజు కుటుంబ సభ్యులు తనకల్లు మండల కేంద్రానికి వెళ్లి అక్కడే కాపురం ఉన్నారు. జూన్ 27న స్వగ్రామానికి వచ్చిన రాజుకు మాల సామాజిక వర్గానికి చెందిన కిష్టయ్య ఎదురుపడటంతో కులం పేరుతో దూషించి కర్రతో దాడి చేయడానికి ప్రయత్నించాడు. సోమవారం మళ్లీ తన కుమారులు నంద కిషోర్, నవీన్‌తో కలిసి ఇంటివద్ద ఉన్న క్రిష్టయ్యను కులం పేరుతో దూషించాడు. క్రిష్ణయ్య ఫిర్యాదు మేరకు రాజు, అతని కుమారులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ రమణ తెలిపారు.

పౌష్టికాహారం సక్రమంగా ఇవ్వండి

గాండ్లపెంట: అంగన్‌వాడీ కార్యకర్తలు లబ్ధిదారులకు పౌష్టికాహారాన్ని సక్రమంగా అందించాలని ఎంపీడీఓ వెంకట్రామిరెడ్డి సూచించారు. సోమయాజులపల్లిలోని మెయిన్ అంగన్‌వాడీ కేంద్రంతో పాటు మిని అంగన్‌వాడీ అంగన్‌వాడీ కేంద్రాలను ఆయన సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ సునిత పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి వీడ్కోలు

కనగానపల్లి: స్థానిక ప్రాథమిక పాఠశాలలో పని చేస్తూ ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయుడు రామసుబ్బారెడ్డికి ఘనంగా వీడ్కోలు పలికారు. సోమవారం స్థానిక పాఠశాలలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ఎంఈఓలు అరుణమ్మ, శ్రీదేవితో పాఠశాలల ఉపాధ్యాయులు ఆయనకు పూలమాలలు, శాలవాలు వేసి సన్మానించారు.

కూలి చెల్లింపునకు డిమాండ్

ధర్మవరం రూరల్: ఉపాధి హామీ కింద పనులు చేసిన కూలీలకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని ఏపీ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం వారు ఎంపీడీఓ సాయిమనోహర్‌కు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు జంగాలపల్లి పెద్దన్న, మారుతి, హైదర్‌వలి పాల్గొన్నారు.

చంద్రానాయక్ తండాలో సోదాలు

తలుపుల: చంద్రానాయక్ తండాలో సోమవారం రూరల్ సీఐ నాగేంద్ర, ఎస్‌ఐలు నరసింహుడు, గోపీ తమ సిబ్బందితో సోమవారం ఇంటింటా సోదాలు చేపట్టారు. తండా సమీపంలో సారా బట్టీలు ధ్వంసం చేశారు.

సత్వర పరిష్కారానికి చర్యలు

ధర్మవరం అర్బన్: ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని ఆర్డీఓ మహేష్ తెలిపారు. ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ప్రజల నుంచి 8 అర్జీలు స్వీకరించారు.

చట్టాలపై అవగాహన పెంచుకోండి

ధర్మవరం రూరల్: చట్టాలపై అవగాహన పెంచుకోవాలని రూరల్ ఎస్‌ఐ శ్రీనివాసులు ఎస్సీ కాలనీ వాసులకు సూచించారు. సోమవారం ముచ్చురామి గ్రామంలోని ఎస్సీ కాలనీలో రెవెన్యూ అధికారులతో కలిసి సివిల్ రైట్స్ డే నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఈశ్వరయ్య, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డీఎస్పీ పల్లెనిద్ర

కదిరి అర్బన్: అలీపూర్‌తండాలో సోమవారం రాత్రి డీఎస్పీ శివనారాయణస్వామి రూరల్ అప్‌గ్రేడ్ పోలీ స్టేషన్ సీఐ నిరంజన్‌రెడ్డితో కలిసి 'పల్లె నిద్ర' కార్యక్రమం నిర్వహించారు.

మహిళకు గాయాలు

తనకల్లు: రోడ్డు ప్రమాదంలో నిర్మలమ్మ అనే మహిళ గాయపడింది. మొగిలిచెట్లతండాకు చెందిన పలువురు కూలీలు సోమవారం కొక్కంటిక్రాస్‌లో పనికి వెళ్లారు. పని ముగిసిన అనంతరం ఆటోలో స్వగ్రామానికి బయలుదేరారు. తండా దగ్గరకు రాగానే కోటపల్లి వైపు నుంచి ట్రాక్టర్ వేగంగా వచ్చి ఆటోను ఢీకొంది. ఆటోలో ఉన్న నిర్మలమ్మకు గాయాలయ్యాయి.